'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# పతనానికి ఎన్నో కారణాలున్నాయి



టంకశాల అశోక్

**మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తాజాగా మరొక గొప్పమాట సెలవిచ్చారు. ఆయన ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ ఎన్నికల సభలో 17వ తేదీన ప్రసంగిస్తూ, ఒకవేళ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల ఇండియా కూటమి అధికారానికి వచ్చినట్టయితే అయోధ్యలోని రామ మందిరంపైకి బుల్డోజర్లను పంపి కూల్చివేయగలదని అన్నారు. రామ్‌లల్లాను తిరిగి గుడారం కిందకు తీసుకురాగలదన్నారు. అంతేకాదు, బుల్డోజర్లను ఎక్కడ నడపాలో ఆ రెండు పార్టీలు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వద్ద ట్యూషన్ చెప్పించుకోవాలని కూడా సూచించారు. వాటిని యోగి నడిపింది ఎవరి ఇళ్ల పైకో తెలిసిందే. ఇటువంటి మాటలు విన్న నాగరికులైన ప్రజలకు, సాధారణ ప్రజలకు సైతం, ఒక ప్రజాస్వామిక దేశ ప్రధానమంత్రి ఈ తీరున మాట్లాడగలరా అని నమ్మశక్యంగా తోచదు. అయితే, ఆయన ఈ విధమైన పతనానికి తగిన కారణాలున్నాయి. అవేమిటో మునుముందు చూద్దాము.**

రాజకీయాల్లో కొన్ని దశాబ్దాల అనుభవం, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా మరికొన్ని దశాబ్దాల అనుభవం గల మోదీకి 2014, 2019 ఎన్నికల ప్రచారంలో లేనివిధంగా ఈసారి నిజంగా భయంకరమైన స్థాయికి దిగజారి ప్రచారాలు సాగిస్తున్నారు. పైన పేర్కొన్నది ఒకరోజు నాటి ఒక సభ గురించి మాత్రమే. కాని ప్రస్తుత ఎన్నికలు ప్రకటించినప్పటి నుంచి మొదలుకొని వారాలకు వారాలు గడుస్తున్నా ఆయన ప్రచారం ఇదే ధోరణిలో నడుస్తున్నది. 2014, 2019లో లేని ఈ కొత్త మార్పు ఇప్పుడెందుకని కొందరు ఆశ్చర్యపోవచ్చు. ఆయన గత ముప్పై ఏండ్లలోనే ఏ పార్టీకి గాని, కూటమికి గాని రాని విధంగా ఈ రెండు మార్లు బీజేపీకి లోక్‌సభలో పూర్తి మెజారిటీని సాధించారు. పరిపాలన మాట ఎట్లున్నా సొంత పార్టీలో, మొత్తం దేశ రాజకీయాలలో తిరుగులేని నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. భారతదేశంలోనే గాక విదేశాలలో కూడా. ప్రస్తుత 2024 ఎన్నికలలోనూ సీట్లు ఒకవేళ కొంత తగ్గినా ఆయనే తిరిగి ప్రధాని కాగలరన్నది దేశ, విదేశాలలో, ఇక్కడి ప్రతిపక్షాలలో కూడా ఎక్కువమంది నమ్ముతున్న మాట.

అటువంటప్పుడు ఏ విధంగా ఆలోచించినా నరేంద్ర మోదీ తన స్థాయిని మరిచి, తన వ్యక్తిత్వాన్ని ఇంతగా పతనం చేసుకొని, ఇంతగా దేశ విదేశాలలో అప్రతిష్ట పాలవుతూ, సమాజానికి ఇంత తీవ్రమైన హాని కలుగజేస్తూ, ప్రజాస్వామిక విలువలను ఇంతగా నష్టపరుస్తూ , ఇంత హీనంగా వ్యవహరించవలసిన అగత్యం ఏమి వచ్చిందన్నది పలువురికి బోధపడని విషయం. సాధారణంగా ఒక పార్టీ వరుసగా రెండు సార్లు అధికారంలో ఉన్నప్పుడు కొంత యాంటీ ఇన్‌కంబెన్సీ అనేది ఏర్పడుతుంది. కాని అటువంటిది లేకపోగా తనకు ప్రజాదరణ ఇంకా పెరిగినట్టు నిరూపించుకోవాలన్నది మోదీ ఆలోచన అయినట్టు కనిపిస్తున్నది. తన నాయకత్వాన బీజేపీ 2014లో 282 సీట్లు గెలువగా 2019లో 303కు పెంచుకున్నది. అదేవిధంగా ఆయన కూటమి అయిన ఎన్డీయే సీట్లు 336 నుంచి 353కు పెరిగాయి. ఆ విధంగా మొదటిసారి నుంచి రెండవసారికి యాంటీ ఇన్‌కంబెన్సీ లేకపోయింది. అందుకు మోదీకి ప్రశంసలు లభించాయి. ఈ మూడవసారి కూడా వరుసగా అధికారానికి వచ్చి నెహ్రూ రికార్డును చెరిపివేయాలని, అంతేగాక, బీజేపీ, ఎన్డీయేల బలాన్ని మరింత పెంచాలన్న కోరిక ఆయనకు బలంగా ఉన్నట్టున్నది. అందువల్లనే కావచ్చు 2024లోనూ తమదే అధికారం అనటంతో ఆగక 'చార్ సౌ పార్' అంటూ సీట్లు 400 దాటుతామని మొదటినుంచి పదే పదే ప్రకటిస్తున్నారు. ఇది తేలికైన లక్ష్యం కాదు. మూడవసారి కూడా గెలవాలని కోరుకోవటం వేరు, 400 స్థానాలు దాటాలనుకోవటం వేరు.



సరిగ్గా ఇక్కడే సమస్యకు మూలం ఉన్నట్టు కనిపిస్తున్నది. గెలవటం మాట సరేసరి కాగా, 400 సీట్లు సాధించటమన్న లక్ష్యాన్ని మోదీ తనకు తాను ఒక మహా ప్రతిష్ఠాత్మకమైన విషయంగా మార్చుకున్నట్టు కనిపిస్తున్నది. అదిగాని జరిగినట్టయితే దాని ప్రభావాలు పలు విధాలుగా ఉంటాయి. ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి దారుణంగా దెబ్బతినిపోతాయి. ఏ కూటమిలోనూ చేరని తటస్థ పార్టీలు బలహీనపడి నైతికంగా, రాజకీయంగా కుంగిపోతాయి. స్వాతంత్ర్యం లభించినప్పటి నుంచి గత 75 ఏండ్లలో ఏ పార్టీకి ఎప్పుడూ లేనంత ఖ్యాతి బీజేపీకి పెరుగుతుంది. తామింకా అధికారంలో లేని రాష్ట్రాలలో అధికార సాధనకు మార్గం సుగమమవుతుంది. ముఖ్యంగా, ఇంతకాలం జనసంఘ్‌కు గాని, బీజేపీకి గాని, సంఘ్‌పరివార్‌కు గాని కొరకరాని కొయ్యగా మిగిలిన దక్షిణాది స్వాధీనమయ్యే అవకాశం బహుశా లభిస్తుంది. పరిపాలనాపరంగా, మతతత్వపరంగా ఎదురవుతున్న విమర్శలను ఇక ఇప్పటిస్థాయిలో అయినా లెక్కపెట్టవలసిన అవసరం ఉండదు.

**బీజేపీ సుదూర భవిష్యత్తులో ఎంతమాత్రం ఎదురులేని శక్తిగా మారుతుంది. పార్టీ అజెండాలో గల కొన్ని వివాదాస్పద అంశాలను ఇప్పటికే అమలుకు తేగా, తక్కినవాటి అమలుకు కూడా వీలు కలుగుతుంది. రాజ్యాంగం రద్దు ఆలోచన నిజంగానే ఉన్నపక్షంలో ఆ పని చేయగలరు కావొచ్చు. మరొకస్థాయిలో, సంఘ్ పరివార్‌కు మొదటినుంచి కూడా భారతదేశాన్ని హిందూరాజ్యంగా మార్చే తలంపు ఉన్నందున, ఆ దిశలో ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకుంటున్న దరిమిలా, ఇక ముందు అనేక చర్యలు ఎటువంటి సంకోచం లేకుండా తీసుకోగలరు.**

ఇక వ్యక్తిగతంగా మోదీ నాయకత్వానికి కలిగే ఉపయోగాల గురించి చెప్పనక్కరలేదు. ఇట్లా పలువిధాలుగా చూసినప్పుడు, 400 స్థానాల ప్రాముఖ్యం ఏమిటో గ్రహించవచ్చు. మోదీకి గుజరాత్ రోజుల నుంచి కూడా తను మొదట సంఘ్‌పరివార్ సంస్థలలో పనిచేస్తుండినా, తర్వాత రాజకీయాలలోకి వచ్చినా, ముఖ్యమంత్రి అయినా చాలా పట్టుదల మనిషి అనే పేరున్నది. ఆ విధంగా ఇప్పుడు 400 సీట్ల లక్ష్యాన్ని నిర్ణయించింది తనే తప్ప సంఘ్‌పరివార్ కాదు. దానిని సాధించాలన్న పట్టుదల తనకున్నది అందువల్లనేనని అనుకోవచ్చు. ఇక్కడ మరొకమాట కూడా చెప్పుకోవాలి. బీజేపికి మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అయినప్పటికీ, ముఖ్యంగా గోల్వాల్కర్ తర్వాత కాలంలో పార్టీ నాయకులు ఏదో ఒక మేర స్వతంత్రించి వ్యవహరించటం మొదలుపెట్టారు. ఇది వాజపేయి, అద్వానీల కాలంలో స్పష్టమైంది. ఈ లక్షణాలను మోదీ సైతం గుజరాత్ రోజుల నుంచే ప్రదర్శించటం మొదలైంది. బయటి లోకానికి ఎక్కువ కన్పించకపోయినా ఇప్పటికీ కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని పరివార్ నాయకత్వం గుర్తించినప్పటికీ మోదీ బలం, ప్రభుత్వ అధికారం, దాన్ని ఆధారం చేసుకొని హిందూత్వ అజెండాను ముందుకు తీసుకుపోగలగటం వంటి అవకాశాల దృష్ట్యా ఏమీ అనలేకుండా ఉన్నది. పరివార్‌లోనూ కొందరికి అధికారపు రుచి దొరికిందంటారు. ఇది కూడా మోదీ బలాన్ని ఆత్మవిశ్వాసాన్ని, ధీమాను పెంచుతున్నదనుకోవాలి.

**మొత్తానికి మోదీకి మొదటినుంచి గల ఈ పట్టుదల తత్వం కూడా ఇపుడు 400 సీట్ల పట్టుదలలో ప్రతిఫలిస్తున్నదని చెప్పాలి. ఆ విధంగా జరుగుతుందా లేదా అనేది వేరే విషయం. కాని ప్రస్తుతానికి తన పట్టుదలను గమనించి అర్థం చేసుకోవటం అవసరం. ప్రతిపక్షాలతో పాటు మోదీ విమర్శకులు చేస్తున్నట్టు ఇవన్నీ పగటి కలలంటూ కొట్టివేయటం వల్ల ఉపయోగం ఉండదు. ఒక స్థితిని సక్రమంగా అర్థం చేసుకొనేవారే అందుకు పరిష్కారాన్ని కనుగొనగలరు.**

ఈ ప్రయోజనాలన్నింటిని దృష్టిలో ఉంచుకున్నందువల్లనే 400 సీట్లు ఎట్లాగైనా గెలిచితీరాలని భావిస్తున్న మోదీ, అందుకోసమే హిందువులను అత్యధిక స్థాయిలో పోలరైజ్ చేసేందుకు మొదట చెప్పుకొన్న యూపీ తరహా ప్రసంగాలు చేస్తున్నారా? అవుననే తోస్తున్నది. లేనట్టయితే, ఎన్నికలు ప్రకటించినదే తడవు ముస్లింలపై, ప్రతిపక్షాలపై, విమర్శకులపై ఎడతెరిపి లేకుండా ఈ విధమైన పూర్తి అసంబద్ధమైన ఆరోపణలు, దాడులు చేయవలసిన అవసరమే లేదు. తను చూపుతున్న ధోరణి ఎటువంటిదో, దాని ప్రభావమేదో, దానిపై దేశ విదేశాలలో వస్తున్న విమర్శలేమిటో, అందువల్ల తన ప్రతిష్ఠ ఎంత దెబ్బతింటున్నదో తెలియని వ్యక్తి కాదాయన. అయినప్పటికీ అదే ధోరణి కొనసాగిస్తున్నారంటే, పైన పేర్కొన్న వివిధ ప్రయోజనాలే తనకు ముఖ్యమనిపిస్తున్నాయన్న మాట. ఆ మేరకు ఆయన ఏమేమి మాట్లాడుతూ వస్తున్నారో ఇక్కడ జాబితా రాయనక్కరలేదు. జూన్ 1న జరిగే తుది విడత పోలింగ్‌కు ప్రచారం ముగిసేలోగా ఇంకా ఏమేమి మాట్లాడగలరోనని దేశ ప్రజలు ఊపిరి బిగపట్టి వేచి చూడవలసిందే. ఇప్పటికే బాహాటంగానూ, చాపకింద నీటి వలెనూ వ్యాపించి భారత సమాజాన్ని విషప్రాయం చేస్తున్న మత విద్వేషాల వల్ల, ఎన్నికల తర్వాత కాలంలో ఏమి జరగగలదోనని భయపడుతుండవలసిందే. ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని మోదీయే సగర్వంగా చాటిన మన దేశం ఆయన హయాంలో ఇప్పటికే ఎన్నికైన నియంతృత్వమనే పేరు తెచ్చుకొని, ప్రపంచ ప్రజాస్వామిక దేశాల ర్యాంకింగ్స్‌లో 105వ స్థానానికి పడిపోయిన స్థితిలో, మునుముందు మరేమి జరగవచ్చునో అని బెంగపడుతుండవలసిందే. ఇందువల్ల దేశం, సమాజం చివరికి మోదీయే మేనేజ్ చేయలేనివిధంగా మారే ప్రమాదం ఉన్నది.

ఇదంతా ఇట్లుండగా మరొకవిధమైన అంచనాలు సాగుతున్నాయి. మోదీకి, ఎన్డీయేకు 400 స్థానాలు కాదు గదా కనీస మెజారిటీ అయిన 272 సీట్లు కూడా వచ్చే అవకాశం లేదని, అది గ్రహించినందువల్లనే తను ఒత్తిడికి గురవుతూ నానాటికి మరింత అసంబద్ధమైన, మరింత తీవ్రమైన, ప్రమాదకరమైన భాష మాట్లాడుతూ పోలరైజేషన్‌ను పెంచజూస్తున్నారని. ఇవి ఎంత వరకు సరైన అంచనాలో చెప్పగల స్థితిలో మనము లేము. కాని మోదీ ధోరణి మహా ఆందోళనకరంగా ఉందన్నది మాత్రం కండ్ల ఎదుట కనిపిస్తున్నది.

# రైతు గోస బీజేపీ పుణ్యమే



మూడ్ శోభన్
99497 25951

**ఉన్నది లేనట్టుగా.. లేనిది ఉన్నట్టుగా ప్రచారం చేయడంలో బీజేపీని మించిన పార్టీ లేదు. అందుకే ఆ పార్టీకి వాట్సాప్ యూనివర్సిటీ అనే ట్యాగ్‌లైన్ కూడా జతయింది. దేశంలో జరుగుతున్న ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ ఇదే తంత్రాన్ని ఉపయోగిస్తున్నది. 'అబ్ కీ బార్ చార్‌సౌకీ పార్' అనే నినాదంతో ఎన్నికల సమరంలోకి దిగిన బీజేపీ అబద్ధాలు, దుష్ప్రచారాలనే నమ్ముకుంటూ ప్రజలను, ముఖ్యంగా రైతులను మోసం చేస్తున్నది. పదేండ్ల పాటు అధికారంలో ఉన్న ఆ పార్టీ కర్షకులపై అదనపు భారం మోపిందే తప్ప ఎటువంటి మేలు చేయలేదనేది జగమెరిగిన సత్యం.**



వాస్తవాలను దాస్తూ, తప్పుడు ప్రచారాల ద్వారా అన్నదాతలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్న బీజేపీకి కార్పొరేట్ మీడియా సహకరిస్తుండటం ఆందోళనకరం. ఈ పరిస్థితుల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల గురించి బీజేపీ చేస్తున్న ప్రచారం, అసలు వాస్తవాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

రైతుల ఆదాయం రెట్టింపు చేశామని బీజేపీ అంటున్నది. అంతేకాదు, కనీస మద్దతు ధరలు పెంచామని, ఫసల్ బీమా యోజనతో రైతులకు మేలు జరిగిందని, కిసాన్ సమ్మాన్ యోజనతో కర్షకులకు ప్రయోజనం చేకూరిందని బీజేపీ ప్రచారం చేస్తున్నది. కానీ, వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. వ్యవసాయ కుటుంబాలకు సాగు ద్వారా లభించే నెలవారీ ఆదాయం 2011-12లో రూ.2,855గా ఉండగా.. 2018-19 నాటికి రూ.2,816కు పడిపోయింది.

మోదీ ప్రభుత్వ హయాంలో కనీస మద్దతు ధరలు నత్తనడకన పెరిగాయి. 2003-04 నుంచి 2012-13 మధ్యకాలంలో ప్రధాన ఆహార పంటల మద్దతు ధరలు ఏడాదికి సగటున 8-9 శాతం వరకు పెరగగా.. 2013-14 నుంచి 2022-23 వరకు చూసుకుంటే 5 శాతమే పెరిగాయి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తానని మోదీ హామీ ఇచ్చారు. అంటే సీ2 ఉత్పత్తి వ్యయం కంటే 50 శాతం అధికంగా మద్దతు ధరను నిర్ణయించాలి. సీ2 ఉత్పత్తి ఖర్చు అంటే ఉత్పత్తి వ్యయం, కుటుంబ శ్రమకు సంబంధించిన విలువ, యాజమాన్య మూలధనం విలువపై వడ్డీ, భూమి అద్దె, సొంత భూమి ఉంటే కౌలు విలువ. కానీ, మోదీ ప్రభుత్వం మాత్రం ఏ2 జీఎఫ్ఎల్ (డబ్బు చెల్లించి కొనే అన్ని ఉపకరణాలు, సేవలు, జీ కుటుంబసభ్యుల శ్రమ విలువ) ఉత్పత్తి వ్యయంపై మద్దతు ధర నిర్ణయిస్తుంది. ఈ విధానంలో మూలధన ఆస్తుల విలువపై వడ్డీ, సొంత భూమికి కౌలు విలువను మినహాయించారు. ఇటువంటి తప్పుడు విధానాల కారణంగా క్వింటాలుకు దాదాపు రూ.500-600 వరకు రైతులు నష్టపోతున్నారు.

మోదీ హయాంలో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందనడానికి నిదర్శనమే పెరిగిన రైతు ఆత్మహత్యలు. 1997-2022 మధ్యకాలంలో 3.50 లక్షల మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకోగా 2014-2022 మధ్యకాలంలో 1,00,474 మంది బలవన్మరణానికి పాల్పడటం గమనార్హం. మోదీ సర్కార్ రెండోసారి అధికారం చేపట్టాక ఆత్మహత్యలు మరింతగా పెరిగాయి. 2019లో (10,281), 2020లో (10,677), 2021లో (10,881), 2022లో (11,290) ఇలా ఏటికేడు బలవన్మరణాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించడంలోనూ మోదీ ప్రభుత్వం విఫలమైంది.

కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) అనేది ఓ విఫల పథకం. బీహార్, పశ్చిమబెంగాల్, ఏపీ, గుజరాత్, జార్ఖండ్ లాంటి అనేక రాష్ట్రాలు ఈ పథకం నుంచి వైదొలిగి సొంతంగా పంటల బీమా పథకాలను రూపొందించుకున్నాయి. ఈ పథకం కింద 2016-17లో 570.8 లక్షల హెక్టార్ల భూమికి బీమా చేయగా.. 2022-23 నాటికి అది 487.4 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. 2018లో రూ.29,337 కోట్లుగా ఉన్న క్లెయిములు.. 2022 నాటికి రూ.18,043 కోట్లకు పడిపోయాయి. ఈ పథకం కార్పొరేట్ బీమా కంపెనీల లాభాపేక్ష కోసమే తీసుకొచ్చినట్టయింది. జాతీయస్థాయిలో రైతులకు రుణమాఫీ 2008లో అమలైంది. 2022 జూలైలో ఎస్‌బీఐ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం.. 2014 తర్వాత ప్రకటించిన రుణమాఫీ పథకాల్లో అర్హులైన లబ్ధిదారుల్లో 50 శాతం మందికే రుణమాఫీ జరిగింది. వాస్తవానికి రుణాలు చెల్లించడంలో రైతులు అత్యుత్తమ రికార్డును కలిగి ఉన్నారు. వ్యవసాయ వృద్ధిరేటు తక్కువగా ఉన్నప్పటికీ, సంక్షోభం అంచుల్లో వ్యవసాయ రంగం ఉన్నప్పటికీ.. పారిశ్రామిక రంగం కంటే వ్యవసాయ రంగంలో నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పీఏ) చాలా తక్కువగా (17.4 శాతం) ఉండటం గమనార్హం.

వ్యవసాయ కార్మికులను కేంద్రం నిండా ముంచింది. గ్రామీణ ప్రజల ఆదాయం పెరిగిందని, ఉపాధి హామీకి కేటాయింపులు పెరిగాయని మోదీ సర్కార్ ప్రచారం చేసుకుంటున్నది. కానీ, వాస్తవమేమంటే.. గ్రామీణ భారత్‌లో నిరుద్యోగ సమస్య మరింత ఎక్కువైంది. 2013-14 నుంచి 2018-19 వరకు వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికుల వేతనాల్లో ఏటా 3 శాతం తగ్గుదల నమోదైంది. ఆర్‌బీఐ ప్రకారం.. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్రప్రదేశ్, యూపీ కార్మికులు జాతీయ సగటు కన్నా చాలా తక్కువ రోజువారీ వేతనాలు పొందుతున్నారు. రోజువారీ వేతనం జాతీయ సగటు రూ.345.70 కాగా.. గుజరాత్‌లోని వ్యవసాయ కార్మికులు రూ.241.90 మాత్రమే పొందుతున్నారు. మధ్యప్రదేశ్‌లో అత్యల్పంగా దినసరి వేతనం రూ.221.90గా ఉన్నది.

ఉపాధిహామీ పథకానికి ఏటా నిధులను తగ్గిస్తున్న బీజేపీ సర్కార్ ఆ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. 2013-14 బడ్జెట్‌లో 1.98 శాతం నిధులను ఈ పథకానికి కేటాయించగా.. 2023-24 నాటికి ఆ మొత్తం 1.33 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. ఓ నివేదిక ప్రకారం.. గత 21 నెలల్లో దేశవ్యాప్తంగా 7.6 కోట్ల జాబ్‌కార్డులను తొలగించారు. చట్టంలో వంద రోజుల పాటు పని కల్పించాలని హామీ ఉన్నప్పటికీ 2020-21లో తప్ప మిగిలిన అన్ని సంవత్సరాల్లోనూ సగటు పనిదినాలు 50కి మించలేదు. కార్మికులకు చెల్లించే సగటు వేతనాలు పెరగడం లేదు.

**నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్‌వో) నివేదిక ప్రకారం.. 2018-19లో 41 శాతం గ్రామీణ కుటుంబాలకు భూమి లేదు. అభివృద్ధి పేరిట కార్పొరేట్లకు వ్యవసాయ భూములను కట్టబెడుతుండటంతో కొద్దిపాటి సాగు భూమిని కూడా రైతులు కోల్పోతున్నారు. పరిహారం విషయంలోనూ రైతులకు అన్యాయం జరుగుతున్నది. రుణాలు, సామాజిక భద్రత తదితర అంశాల్లోనూ వ్యవసాయ కార్మికులు అన్యాయానికి గురవుతున్నారు. 2019లో ప్రారంభమైన ప్రధానమంత్రి శ్రమయోగి మన్-ధన్ పింఛన్ పథకం వల్ల కార్మికులకు ప్రయోజనం చేకూరడం లేదు.**

వలస కార్మికుల తరఫున సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల జాతీయ డేటాబేస్‌ను ప్రారంభించే లక్ష్యంతో 2021లో శ్రమ పోర్టల్‌ను ప్రారంభించింది. కానీ, అందులో ఎలాంటి సామాజిక ప్రయోజనాలను ప్రకటించలేదు. కార్పొరేట్ మీడియా ఈ పోర్టల్‌కు పెద్దఎత్తున ప్రచారం కల్పించింది. కానీ, వాస్తవానికి ఈ పథకం నుంచి ఒక్క వ్యవసాయ కార్మికునికి కూడా ప్రయోజనం చేకూరలేదు. ఇలా.. ప్రతీ పథకంలో వాస్తవాలు ఒకలా ఉంటే బీజేపీ మాత్రం తనకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటూ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నది. దేశ ప్రజలు నిజాలను గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**(వ్యాసకర్త: తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి)**



# సినిమాకు 'తెర'పడింది



జోస్యుల వేణుగోపాల్
94404 36806

ఒకప్పుడు సినిమా అంటే ఓ ఎమోషన్. సినిమా థియేటర్ ఓ జ్ఞాపకం. సినిమా అంటే చాలు జనం ఎగబడేవారు. పల్లెటూర్ల ప్రజలు ఏకంగా ఎడ్ల బండ్లు కట్టించుకొని మరీ థియేటర్లకు వెళ్లేవారు. ఆ కాలంలోనే మాయాబజార్, లవకుశ లాంటి సినిమాలు రజతోత్సవం, శతదినోత్సవాలు జరుపుకొన్నాయి. కానీ, ఇప్పటి సినిమాలు పట్టుమని పది రోజులైనా ఆడటం లేదు. నాడు ఓ వెలుగు వెలిగిన థియేటర్లు నేడు కళ తప్పాయి. టూరింగ్ టాకీస్‌లు, నేల టిక్కెట్, గోడలపై పోస్టర్లు.. ఇలా ఒక్కొక్కటి తెరమరుగయ్యాయి. నూతన టెక్నాలజీతో పాటే 'తెర'పైకి వచ్చిన మల్టీప్లెక్స్, ఓటీటీ సంస్కృతి సింగిల్ స్క్రీన్ థియేటర్లను అమాంతం మింగేసింది.


వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించే సినిమా రంగం కళ తప్పింది. టెక్నాలజీ అందుబాటులో వచ్చాక నాణ్యత, సహజత్వం పెరగాల్సిందిపోయి సినిమాలు మరింత నాసిరకంగా తయారవుతున్నాయి. ఈ తరం అభిరుచులకు అనుగుణంగా కథల్లో మార్పులంటూ వచ్చిన నయా పోకడ కారణంగా కథ, కథనంలో అసహజత్వం, అతిశయోక్తి వచ్చి చేరాయి. దీంతో ప్రేక్షకులకు సినిమాలు దూరమైపోయాయి. నాటి నటులు, దర్శకులు సినిమా నిర్మాణాన్ని మహాయజ్ఞంగా భావించేవారు. సహజత్వం కోసం పరితపించేవారు. చిత్రీకరణ పట్ల రాజీపడేవారు కాదు. ఎంతో అంకితభావంతో పనిచేసే నాటి దర్శక, నిర్మాతలు తమ సినిమాల్లో అసభ్యత, అశ్లీలతకు చోటిచ్చేవారు కాదు.

కాలం మారింది, కాలంతో పాటే కథలూ మారాయి. ప్రస్తుతం ఏ సినిమా చూసినా హీరో, హీరోయిన్ల చుట్టే కథలు తిరుగుతున్నాయి. కమర్షియల్ హంగులు తప్ప వినోదం, విజ్ఞానం అనేమాటే లేకుండాపోయింది. కుటుంబ విలువలు, బాంధవ్యాల ప్రస్తావనే లేదు. పైగా నిర్మాణ ఖర్చులో మూడొంతులు హీరో, హీరోయిన్ల రెమ్యునరేషన్‌కే కేటాయించాల్సి వస్తున్నది. దీంతో మిగిలిన ఒక వంతుతోనే సినిమా నిర్మాణం చేపట్టాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ కారణంగా సినిమాలో కథ, కథనాలకు చోటే దక్కడం లేదు.

మూసధోరణిలో వరుసపెట్టి వస్తున్న సినిమాల కారణంగా ప్రేక్షకుడు థియేటర్లకు రావడమే మానేశాడు. అదే సమయంలో మల్టీప్లెక్స్‌లు, ఓటీటీల రాకతో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కరూ అడుగు పెట్టడం లేదు. విపరీతంగా పెరిగిన ఖర్చులను భరించలేక సినిమా టాకీస్‌లు మూతబడుతున్నాయి. వాటి స్థానంలో మల్టీప్లెక్స్‌లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు పుట్టుకొస్తున్నాయి. దీంతో ఒకప్పుడు వినోదాన్ని అందించిన సినిమా హాళ్లు వ్యాపార స్థావరాలుగా మారిపోయాయి. దోపిడీకి గురవుతున్న ప్రేక్షకుడు సినిమా థియేటర్ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇది ఎంత వరకు వచ్చిందంటే తెలంగాణలో ఏకంగా 10 రోజుల పాటు థియేటర్లను మూసివేసేంత.

**ఇది సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్య మాత్రమే కాదు. సినిమా ఇండస్ట్రీ మొత్తానికి సంబంధించినది. కథలో విషయం ఉంటే ప్రేక్షకులు ఇప్పటికీ ఆదరిస్తారని రుజువవుతూనే ఉన్నది. కథ, కథనం సరిగ్గా ఉంటే కుటుంబ కథా చిత్రాలను ఇప్పటికీ, ఎప్పటికీ ప్రేక్షకులు ఆదరిస్తారని బలగం సినిమా మరోసారి రుజువు చేసింది. ఈ నేపథ్యంలో సినీ రచయితలు కొత్త కథలను అన్వేషించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికైనా మేలుకోకపోతే నాటకాలు అంతరించిపోయినట్టే.. సినిమా కూడా అంతరించిపోవడం ఖాయం.**

## పోరు జరగాల్సింది వీటిపై!



*దేశంలో ఓ కొత్త ట్రెండ్ నడుస్తున్నది. ఇటు స్థానిక, అటు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఉద్దేశపూర్వకంగా పాకిస్థాన్‌ను చొప్పిస్తున్నారు. తద్వారా పాకిస్థాన్ లాంటి అతిచిన్న సమస్య ఎన్నికల్లో ప్రధానాంశంగా మారుతున్నది. లోక్‌సభ ఎన్నికల పోరు జరగాల్సింది పెరిగిన ధరలు, నిరుద్యోగం లాంటి అంశాల గురించి. అంతేకానీ పాకిస్థాన్ గురించి కాదు.*

**- గులాం నబీ ఆజాద్,** జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

